

అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ
28 నుంచి సెమిస్టర్ పరీక్షలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు ఈనెల 28వ తేదీ నుండి నవంబర్ 4వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఓపెన్ యూనివర్సిటీ కోఆర్డినేటర్ మీరా సాహెబ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షల హాల్ టికెట్ కోసం విశ్వవిద్యాలయ వెబ్ పోటల్‌లో పొందవచ్చు అని తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు హాల్ టికెట్ ఐడెంటి కార్డులు తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. మధ్యాహ్నం రెండు గంటల నుండి జరగనున్న ఈ పరీక్షలకు పరీక్ష కేంద్రాల వద్దకు 30 నిమిషాలకు ముందుగా చేరుకోవాలని, ఇతర వివరాల కోసం నెంబర్ 738292 9664 సంప్రదించాలని కోరారు.

ప్రజాపోరాటాలు వర్ధిల్లాలి..

- సిపిఎం మహా ప్రదర్శన
- ప్రజలపై భారాలు తగ్గించాలి: సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రమాదేవి



చిత్తూరు రైల్వే స్టేషన్ నుంచి ప్రారంభమైన మహా ప్రదర్శన



జెండాలు చేతపట్టి ప్రదర్శన ముందు వరుసన కార్యకర్తలు


జానపదవృత్తి కళాకారుల కోలాటం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్ సిపిఎం చిత్తూరు జిల్లా 14వ మహాసభ సందర్భంగా శనివారం చిత్తూరు నగరంలో మహా ప్రదర్శన జరిగింది. ఈ మహా ప్రదర్శన రైల్వేస్టేషన్ దగ్గర ప్రారంభమై గాంధీ సర్కిల్, ఎమ్మెస్సార్ సర్కిల్ మీదుగా డీఈఓ ఆఫీస్ వరకు జరిగింది. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు అధ్యక్షతన బహిరంగ సభ జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి మాట్లాడుతూ ఎన్నికలక ముందు సూపర్ సిక్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం నాలుగు నెలలు పూర్తవుతున్నప్పటికీ హామీలు అమలు చేయకపోవడం దారుణమన్నారు. గత ప్రభుత్వం ప్రజా ఉద్యమాల మీద ప్రజా సమస్యను పరిష్కారం చేయకుండా ఉక్కుపాదం మోపినప్పుడు ప్రజలు కార్మికులు తిరగబడి ప్రభుత్వాన్ని ఇంటికి సాగనపారని గుర్తు చేశారు. కొత్త ప్రభుత్వం వస్తే సమస్యలు



ప్రదర్శనలో రాష్ట్ర నాయకులు

పరిష్కారం అవుతాయని ఆశించిన పేదలకు నిరావే మిగిలిందన్నారు. ఉచిత ఇసుక పాలసీ పేదలకు భారంగా మారింది. మద్యం మహిళలు పాలిట శాపంగా మారిందన్నారు. ఇష్టారాజ్యంగా నివాసాల మధ్య మద్యంషాపులు పెడుతూ మహిళలపై దాడులు జరిగే విధంగా ప్రభుత్వమే ప్రోత్సహిస్తున్నట్లుగా ఉందని విమర్శించారు. ప్రభుత్వ విధానాలపై ఎర్రజెండా నిరంతరం పోరాటం చేస్తూ ప్రజల పక్షాన నిలిచిందని తెలిపారు. ప్రజలందరూ కూడా సిపిఎం ప్రజా పోరాటాలను బలపరచాలని పిలుపునిచ్చారు. సిపిఎం రాష్ట్ర నాయకులు దడాల సుబ్బారావు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం లౌకికదేశంలో అనేక కులాలు, మతాలు ఉంటే ఒకే మతం ఉండాలని చిచ్చు పెడుతూ అధికారాన్ని కొనసాగిస్తున్నారని, ఈ ప్రభుత్వాన్ని మూడోసారి మెజార్టీ రానీయకుండా ప్రజలు తిరస్కరించాలని కోరారు. ఇతరుల మద్దతుతో అధికారం చేపడుతూ ప్రజలపై భారాలు మోపడం దుర్మార్గమన్నారు. ఈ మతోన్మాద బీజేపీ ప్రభుత్వాన్ని భవిష్యత్తులో ఎండగట్టి ప్రజలకు అనుకూలమైన ప్రభుత్వాలు వచ్చే విధంగా ప్రజలు పోరాటాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. చిత్తూరు జిల్లాలో దళితుల మీద దాడులు జరిగినప్పుడు సిపిఎం అండగా నిలబడిందన్నారు. మహిళలపై దాడులు చేస్తే సిపిఎం తప్ప ఇతర పార్టీలు మాట్లాడలేని పరిస్థితి ఉందన్నారు. ఈ మహాసభల్లో భవిష్యత్తు పోరాటాలకు పదును పెడతామన్నారు. సభలో సిపిఎం మాజీ జిల్లా కార్యదర్శి చల్లా వెంకటయ్య, జిల్లా నాయకులు సురేంద్రన్, ఓబుల్ రాజు, గిరిధర్ గుప్తా, భువనేశ్వరి, స్క్రీన్ వర్కర్లు, జానపద వృత్తి కళాకారులు పాల్గొన్నారు.

సిసి రోడ్లను పూర్తి చేయండి

కలెక్టర్ సుమిత్ కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2024-25 సంవత్సరానికి గాను మంజూరైన 1485 అంతర్గత సిసి రోడ్ల నిర్మాణంలో భాగంగా వివిధ దశలలో ఉన్న పనులను నాణ్యతతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో కలెక్టర్ పంచాయతీరాజ్ శాఖ ద్వారా మంజురైన అంతర్గత సిసి రోడ్లు, అప్రోచ్ రోడ్లు, బిటి రోడ్లు, ఎంపి ల్యాండ్స్ కింద మంజూరైన పనుల పురోగతిపై నియోజకవర్గాల వారీగా సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ అంతర్గత సిసి రోడ్లకు సంబంధించి 1485 మంజూరు కాగా 413 పనులు గ్రౌండింగ్ కాబడ్డాయని, ఇందులో 239 పనులు పూర్తి కాగా 174 పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. ప్రధానంగా గ్రామీణ రహదారులను అభివృద్ధి చేసేందుకు ప్రాధాన్యత ఇస్తూ సిసి రోడ్లను ప్రభుత్వం మంజూరు చేయడం జరిగిందని, ప్రజాధనం ఎక్కడ వృధా కాకుండా సకాలంలో నాణ్యతతో పనులను పూర్తిచేయాలన్నారు. ఈ విషయంలో సంబంధిత ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకొని పనులను నాణ్యతతో పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. 1,279 పనులకు గుత్తేదారులను గుర్తించడం జరిగిందని, వాటి పనులు కూడా ప్రారంభించేలా డీఈలు, ఏఈలు శ్రద్ధ పెట్టాలన్నారు. ఎస్టిమేషన్ కాస్ట్, బిల్స్ అప్లోడింగ్, పనుల పురోగతిపై డ్వామా పిడి, ఎస్ఈపిఆర్‌లు సమన్వయంతో పర్యవేక్షించాలన్నారు. వర్క్ ఐడి క్రియేట్ చేసి జియో ట్యాగింగ్ చేయాలని ఆదేశించారు. పిఆర్ యాప్‌లో పనుల పురోగతిని సంబంధించిన వివరాలు అప్లోడ్ చేయాలని సూచించారు. సీసీ రోడ్ల మంజూరులో ఇప్పటివరకు ఎస్సీ, ఎస్టీ కాలనీలలో, హౌసింగ్ లేఔట్లలో ప్రాధాన్యతను ఇచ్చి పనులను మంజూరు చేయడం జరిగిందని వీటిని త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొచ్చే దిశగా అధికారులు కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ఎస్ఈపిఆర్ శంకరనారాయణ, ఈఈ చంద్రశేఖర్ రెడ్డి, డ్వామా పీడీ రవికుమార్, సంబంధిత డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

ఫెన్సింగ్ పోటీల్లో మెడల్స్ సాధించిన
విద్యార్థులకు ఎమ్మెల్యే అభినందనలు


మెడల్స్ సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే మురళీ మోహన్

ప్రజాశక్తి- యాదమరి: ఫెన్సింగ్ పోటీల్లో జాతీయ, రాష్ట్ర స్థాయిలో మెడల్స్ సాధించిన యాదమరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులను పూతలపట్టు శాసనసభ్యులు మురళీమోహన్ అభినందించారు. శనివారం చిత్తూరు నగరం లక్ష్మీనగర్ కాలనీలోని ఎమ్మెల్యే నివాసంలో ఫెన్సింగ్ పోటీల్లో గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించిన విద్యార్థులు మర్యాద పూర్వకంగా కలిశారు. వీరిని ఎమ్మెల్యే అభినందించి, మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈనెల 19, 20, 21 తేదీల్లో నంద్యాల్లో జరిగిన 68వ రాష్ట్రస్థాయి పాఠశాల విద్యాసమఖ్య ఆధ్వర్యంలో అండర్ -17 బాలురు, బాలికల ఫెన్సింగ్ పోటీలు జరిగాయి. ఇందుల్లో యాదమరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని యుగ భారతీ, ఫాయిల్ విభాగంలో మానసలు సిల్వర్ మెడల్ సాధించి జాతీయ స్థాయికి ఎంపిక అయ్యారు. ఇదేవిధంగా అండర్ -14 బాలికల విభాగంలో కమల్ ఫాతిమా సిల్వర్ మెడల్ సాధించి జాతీయ స్థాయికి ఎంపిక అయ్యారు. టీం ఈవెంట్ ఇప్పి విభాగంలో మోనీషా, యుగభారతీలు గోల్డ్ మెడల్ సాధించగా, షాయల్ విభాగంలో మానస, ధరణీ సిల్వర్ మెడల్ సాధించారు. సాబర్ విభాగంలో ఫాతిమా ఫిర్దోస్ సిల్వర్ మెడల్ సాధించారు. ఇక బాలురు విభాగంలో యశ్వంత్ బ్రాంజ్ మెడల్, సాబర్ విభాగంలో నందకిషోర్ బ్రాంజ్ మెడల్ సాధించగా, అండర్ -14 ఇప్పి విభాగంలో కమల్ ఫాతిమా సిల్వర్ మెడల్ సాధించి జాతీయస్థాయిలో ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గిరిరాజా, పిడిలు రవి, హరికృష్ణ, దాము, ఉపాధ్యాయులు కృష్ణరెడ్డి, వెంకట రమణ పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులపై ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ప్రత్యేక విభిన్న ప్రతిభావంతుల ఆరోగ్యంపై తల్లిదండ్రులతో పాటు పాఠశాలలోని ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా న్యాయసేవ అధికారి సంస్థ ఇన్చార్జి కార్యదర్శి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి పద్మజ పేర్కొన్నారు. శనివారం ఉదయం పట్టణంలోని తపోవనంలో ఉన్న రాస్ వికాస్ విహార్ స్కూల్‌లో ఉన్న ప్రత్యేక విభిన్న ప్రతిభావంతులకు జిల్లా న్యాయసేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర న్యాయసేవా అధికార సంస్థ ఉత్తర్వులు మేరకు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమారావు ఆదేశాలతో ప్రత్యేక విభిన్న ప్రతిభావంతుల ఆరోగ్య సమస్యలపై జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి సంబంధించిన డాక్టర్ల ఆధ్వర్యంలో ప్రత్యేక హెల్త్ క్యాంపు నిర్వహించడం జరిగిందని తెలిపారు. పాఠశాలలోని 35 మంది విభిన్న ప్రతిభావంతులకు కంటి పరీక్షలు అలాగే మూగ, చెవిటి పిల్లలకు సంబంధించి పరీక్షలు, ఫిజియోథెరపీ నిర్వహించారు. పిల్లల మానసికస్థితిని బట్టి వారికి వైద్యసేవలు అందించి అవసరమైన వారికి కంటి అద్దాలు, మందులు అందజేయడంతోపాటు సరిగా మాట్లాడలేని వారికి థెరపీ శిక్షణా ఇవ్వాలని వైద్యులను ఆదేశించారు. అనంతరం ప్రాంగణంలోని అనాథ ఆశ్రమంలో ఉన్న వయోవృద్ధుల బాగోగులు గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ న్యాయమూర్తి టి.భానుశేఖర్ రెడ్డి, ముత్యాలశెట్టి, వైద్యులు, పాఠశాల ఉపాధ్యాయురాలు పాల్గొన్నారు.


పిల్లలతో మాట్లాడుతున్న జడ్జి పద్మజ

పాత నేరస్తులపై నిఘా

నేర సమీక్షలో జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాలోని డీఎస్పీలు, సిఐలు, ఎస్సైలతో శనివారం ఎస్పీ జిల్లా పోలీసు ట్రైనింగ్ సెంటర్ కాన్ఫరెన్స్ హాల్‌లో నెలవారీ నేరసమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్పీ మణింకఠ చందోలు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న గ్రేవ్ అండ్ నాన్ గ్రేవ్ కేసులు, మర్డర్, డెకాయిటి, రాబరీ, ప్రాపర్టీ, వాహనాలు దొంగతనం, 174 సిఆర్‌పిసి కేసులు, మిస్సింగ్, చీటింగ్, సైబర్ నేరాలు, ఇతర కేసులను సమీక్షించారు. పోలీస్ స్టేషన్ల వారీగా పెండింగ్ కేసుల వివరాలు, ప్రస్తుత కేసుల స్థితిగతులు, నమోదైన కేసుల్లో నేరస్తుల అరెస్టు, కేసు దర్యాప్తు తీరుతెన్నులపై సంబంధిత పోలీస్ అధికారులతో ఆరా తీసి కేసుల ఫైల్స్, రికార్డ్సను క్షుణ్ణంగా పరిశీలించారు. కేసుల ఛేధించడానికి, పరిష్కారానికి, నేర నియంత్రణకు దోహదం చేసే పలు సూచనలు, మెలకువలను అధికారులకు దిశా నిర్దేశాలు చేశారు. కేసు నమోదు అయిన తర్వాత కోర్టులో నిందితులకు జైలు శిక్ష పడేవిధంగా చర్యలు తీసుకున్నప్పుడే బాధితులకు సరైన న్యాయం చేసినట్లు అవుతుందని పోలీస్ అధికారులకు సూచించారు. ఏదైనా దొంగతనం జరిగిన వెంటనే సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని, నేరస్తుడు వదిలిన సాక్ష్యాధారాలు, సిసి కెమెరాల ఫుటేజీలను క్రోడీకరించి ముద్దాయిలను పట్టుకొని, వారి వద్ద నుండి పూర్తిమొత్తంలో దొంగిలించబడిన సొమ్ము రికవరీ చేయాలన్నారు. చిత్తూరు సబ్ డివిజన్ డీఎస్పీ, సర్కిల్ ఇన్స్పెక్టర్లు ఎస్ఐలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు

సమస్యలపై ధ్వజమెత్తిన సభ్యులు

- నాడు- నేడు నిధులు లేక ఆగిన పనులు
- మండలంలో తీవ్రంగా నీటి సమస్య



ప్రజాశక్తి- పుంగనూరు : మండలంలో ఎక్కడి సమస్యలు అక్కడ తిష్టవేశాయని అధికారులు సమస్యల పరిష్కారంలో స్పందించకపోవడంపై సభ్యులు ధ్వజమెత్తారు. స్థానిక మండల కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి అధ్యక్షతన శనివారం జరిగింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అధికారుల సమస్యలపై స్పందించడం లేదని మండలంలో సమస్యలు తిష్ట వేశాయని సమావేశంలో సభ్యుల ధ్వజమెత్తారు. బోడేవారిపల్లి పంచాయతీ ఈడిగ పల్లి గ్రామంలో నాడు-నేడు పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయని, వాటిని వెంటనే పూర్తి చేయాలని ఎంపీటీసీ డిమాండ్ చేశారు. దీనిపై ఎంఈఓ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ మండలంలో ఉన్న నాడు -నేడు నిధులు లేక ఆగిపోయిన పనులు అన్నింటిని గుర్తించి జిల్లా అధికారులు పంపించడం జరిగిందని, నిధులు మంజూరైన వెంటనే పనులు పూర్తి చేస్తామన్నారు. ఎంపీపీ భాస్కర్‌రెడ్డి మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్ల కొరత ఉందని సమస్య పరిష్కరించుకుంటే విద్యార్థులు ప్రైవేటుబాట పట్టే అవకాశం ఉందని వెంటనే పరిష్కరించాలన్నారు. ఎంఈఓ మాట్లాడుతూ పాఠశాలల్లో ఉపాధ్యాయ సమస్య ఉన్నదని మండలంలో 33 టీచర్ల కొరత ఉన్నందున డిప్టేషన్ ద్వారా ఉపాధ్యాయ ఏర్పాటు చేసి క్లాసులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆర్డబ్ల్యూఎస్ జేఈ చందన మాట్లాడుతూ మండలంలో 9 బోర్లకు ప్రపోజల్ పెట్టమని మంజూరైన వెంటనే గుర్తించిన ప్రాంతాల్లో కొత్త బోర్లు వేస్తామన్నారు. ఎంసీ కొత్తూరు, సుగాలి మిట్ట, ఊటూరు తండా, ఇటుక నెల్లూరు, నెక్కుంది, సింగిరిగుంట, మార్లపల్లి గ్రామాల్లో నీటి సమస్యలు ఉన్నాయని కొన్నిచోట్ల కొత్త బోర్లు వేయాలని వారు కోరారు. మరి కొన్నిచోట్ల ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులకు ఏర్పాటు చేసిన ఐరన్ నిచ్చన్లు పూర్తిగా దెబ్బతిన్నాయని ట్యాంకులు శుభ్రపరచాలంటే ఎవరు వెళ్లలేక పోతున్నారని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. అలాగే చంద్రమాకులపల్లి జడ్పీహెచ్ఎస్ స్కూల్లో నీటి సమస్య తీవ్రంగా ఉందని సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి తెలిపారు. అధికారులందరూ వారి శాఖ సమాచారాన్ని చేపట్టిన కార్యక్రమాలను సమావేశం దృష్టికి తీసుకొని రాగా మీ శాఖ ద్వారా మీరు నిర్వహించే కార్యక్రమాలను స్థానిక సర్పంచి ఎంపీటీసీ ఎంపీపీ కు చెప్పకుండా కార్యక్రమాలు చేపట్టడం సమంజసం కాదని ఒకింత అసహనాన్ని వ్యక్తం చేశారు. ఈసమావేశంలో ఇంచార్జ్ ఎంపీడీవో లీలా మాధురి, వైస్ ఎంపీపీ ఈశ్వరమ్మ, సర్పంచులు, ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

పోలీసుల మొహరింపు

మండల సమావేశం ప్రారంభానికి ముందే పోలీసులు భారీగా మోహరించారు. ఏదైనా గొడవలు జరగతాయేమోనని పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేశారు. మండల కార్యాలయంలోకి ఎవరిని అనుమతించకుండా పోలీసు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. పోలీసుల మోహరించడంతో ఏ సమయానికి ఏమి జరుగుతుందోనని కొంత ఉత్కంఠతో నెలకొన్నది. అయితే ఎలాంటి సమస్యలు తలెత్తుకున్న సమావేశం, సభ్యులు సమస్యలపై పశ్నించారు వీటిని అందరూ స్వాగతించారు. దీంతో పోలీసులకు కొంత ఊరట కలిగింది.

అధ్యాపకుల సమస్యలు పరిష్కరించండి

ఎమ్మెల్సీకి పాలిటెక్నిక్ లెక్చరర్స్ వినతి


ఎమ్మెల్సీకి వినతిపత్రాన్ని అందిస్తున్న పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు

ప్రజాశక్తి- కుప్పం టౌన్: పాలిటెక్నిక్ ఆల్ లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ శరత్ రాఘవేంద్ర శనివారం కుప్పం పట్టణంలో ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్సీకి తమ సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న 87 పాలిటెక్నిక్ కళాశాలలో ఉన్న అధ్యాపకులు నూతనంగా అసోసియేషన్ను ప్రారంభించామని, అసోసియేషన్ ఆవశ్యకతను వివరిస్తూ, అసోసియేషన్ సభ్యులను పరిచయం చేశారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి, వాటి పరిష్కారానికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. సమస్యలను ఆలకించిన ఎమ్మెల్సీ వాటిని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వైసి జేమ్స్, పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

సబ్సిడీ డ్రిప్ పరికరాలు పంపిణీ

ప్రజాశక్తి -వెదురుకుప్పం: కార్వేటినగరం మండలం ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో శనివారం స్థానిక ఎమ్మెల్యే వి.ఎం.థామస్ రైతులకు సబ్సిడీ డ్రిప్ పరికరాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని 29 మంది అర్హులైన రైతులకు సబ్సిడీ డ్రిప్ పరికరాలను అందజేసినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమ కోసం కృషి చేస్తోందని తెలిపారు. అనంతరం టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పార్టీశ్రేణులు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు చెంగలరాయల యాదవ్, రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు నాగేశ్వరరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేంద్రరెడ్డి, ఢిల్లీ బాబు, సోమశేఖర్ యాదవ్, బిగల రమేష్, రమేష్ రెడ్డి, చెంగలరాయులు, జనసేన జిడి నెల్లూరు ఇంచార్జ్ పొన్న యుగంధర్, రాఘవ, సురేష్ కుమార్, జ్యోతి యాదవ్ పాల్గొన్నారు.



మద్యం అమ్మకాలకు...
టైమంటూ.. లేదా..?

- ఉదయం 9 నుంచే అమ్మకాలు
- పన్నూరులో నిబంధనల ఉల్లంఘన


ఉదయాన్నే తెరచిన మద్యం షాపు

ప్రజాశక్తి- విజయపురం: విజయపురం మండలంలోని పన్నూరు సబ్‌స్టేషన్ సమీపంలో ఉన్న మద్యం షాప్ యాజమాన్యం సమయపాలన పాటించడం లేదు.. ఉదయం 9 గంటలకు కాకముందే షాపును ప్రారంభించి మద్యం అమ్మకాలు మొదలుపెట్టస్తున్నారు. అలాగే సాయంత్రం పూట కూడా సమయపాలన పాటించడం లేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. లక్షలు వెచ్చించి మద్యం షాపు దక్కించుకున్న యాజమాన్యం నిబంధనకు విరుద్ధంగా మద్యం విక్రయాలు సాగించడంపై స్థానిక మహిళలు మండిపడుతున్నారు. గత ప్రభుత్వం మద్యం షాప్‌ని రద్దుచేసి ప్రైవేటు పరం చేసినప్పటి నుంచి మద్యం విచ్చలవిడితనం ఎక్కువైందని, దీంతో గ్రామాల్లోని మందుబాబులు మద్యం తాగి వీరంగం చేస్తున్నారని, పలువురు అనారోగ్యం పాలవుతున్నారని దీంతో పలు కుటుంబాలు ఇప్పటికే వీధిన పడే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి తోడు మద్యం యాజమాన్యం సమయపాలన పాటించకుండా ఉదయం నుంచే అమ్మడంతో మద్యం ప్రియులు దుకాణాల వద్దే ఉంచిపోతున్నారని తెలిపారు.

మమ్మల్ని ఏమి చేయలేరు..

పన్నూరు సబ్‌స్టేషన్ నాలుగు రోడ్డు కూడలి వద్ద ఉదయం పూట ప్రయాణికులు ఎక్కువగా వేచి ఉంటారు. ఉదయం 8 నుంచి 10 గంటల వరకు వివిధ పనులపై ప్రయాణికులు, స్కూల్, కాలేజీ విద్యార్థులు, పనులు చేసుకునే కూలీలు అక్కడికి వస్తుంటారు. అదే సమయంలో మద్యం షాపులో మద్యం విక్రయం చేయడంతో స్థానికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఉదయం 10 గంటలకు తెరవాల్సిన మద్యం షాపు 9 గంటలు లోపు తెరవడంతో మహిళలు మద్యం యాజమాన్యంపై మండిపడుతున్నారు.

చూసీచూడనట్లు పోతున్న అధికారులు

పన్నూరు సబ్‌స్టేషన్‌లో ఉదయం 9గంటల లోపే మద్యం షాపు ప్రారంభిస్తున్న విషయం ఎక్సైజ్ అధికారులకు తెలుసు. అయినప్పటికీ మద్యం షాపు యాజమాన్యం ఇచ్చే మామూల మత్తులో తూగుతున్నారు తప్ప పట్టించుకోవడం లేదని, అందుకే యాజమాన్యం రెచ్చిపోతూ సమయపాలన పాటించకుండా మద్యం విక్రయిస్తున్నారని మహిళలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పన్నూరు మద్యం షాప్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని లేకుంటే రోడ్డుపై ధర్నాకు దిగి రాస్తారాకో చేపడతామని హెచ్చరిస్తున్నారు.

డీఎస్సీ ఉచిత శిక్షణ గడువు పెంపు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్
సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా ఎస్సీ, ఎస్టీ డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు గడువు ఈనెల 27వ తేదీ వరకు పొడిగించినట్లు సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి రాజ్యలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో అర్హత కలిగిన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మెడికల్ క్యాంపుకు విశేష స్పందన

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: స్థానిక ఓబనపల్లిలో ఇందిరా హాస్పిటల్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత మెడికల్ క్యాంపుకు విశేష స్పందన లభించింది. ఓబనపల్లిలో నిర్వహించిన డయాబెటిస్ ఉచిత క్యాంపులో ఇందిరా ఆసుపత్రి వైద్యనిపుణులు డాక్టర్ సురేష్, భాస్కర్, శ్రీనివాస్ డయాబెటిస్ బ్యాక్ పెయిన్‌తో బాధపడుతున్న 120 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు.

సమాచార హక్కు చట్టం పై అవగాహన

మండల వ్యవసాయ అధికారిని మధురవాణి

ప్రజాశక్తి- పూతలపట్టు: ప్రభుత్వ కార్యాలయాల్లోని ఎలాంటి విషయాలనైనా సమాచార హక్కు చట్టం ద్వారా పొందే హక్కు ప్రతి ఒక్కరికి ఉందని ఏవో మధురవాణి తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె సమాచార చట్టం 2005 గురించి ప్రజలకు వివరించారు. ప్రభుత్వ కార్యాలయం నుంచి అవసరమైన ఎలాంటి సమాచారాన్ని అయినా పొందవచ్చు అని, సంబంధిత అధికారులు ఎందుకు ఏమని ప్రశ్నించకుండా సమాచారం ఇవ్వాల్సి ఉందన్నారు. సమాచారం అడిగిన నెలరోజుల్లో సమాచారం అందించాల్సి ఉందన్నారు. లేనిపక్షంలో సమాచార కమిషన్‌ను ఆశ్రయించే హక్కు లబ్ధిదారునికి ఉందని తెలిపారు.

తవణంపల్లి: మండలంలోని సరకల్లు, వెంగంపల్లి, తొడతర గ్రామాల్లో రైతులకు, గ్రామ ప్రజలకు సమాచార హక్కు చట్టం -2005పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. మండల వ్యవసాయాధికారి జి.ప్రవీణ్, రైతు సేవా కేంద్రం సిబ్బంది కుసుమ, సుహాసిని,దీపిక చట్టం ఉద్దేశ్యం, కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రజలకున్న సందేహాలను నివృత్తి చేశారు.

ప్రతిభ చాటిన విద్యార్థులు




ప్రజాశక్తి- ఐరాల:
పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవ సందర్భంగా చిత్తూరు జిల్లా పోలీస్‌శాఖ వారి ఆధ్వర్యంలో జిల్లాస్థాయిలో నిర్వహించిన వక్తృత్వ పోటీలలో ఐరాల మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎం.పైపల్లె విద్యార్థులు సి.రోహిత్ (పదవ తరగతి) ప్రథమ స్థానం, కె.మానస (9వ తరగతి) ద్వితీయ స్థానం సాధించి ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా ఐరాల మండల విద్యాశాఖ అధికారులు రుశేంద్రబాబు, దామోదర్ నాయుడు, ప్రధానోపాధ్యాయులు బి.అరుణ్ కుమార్ విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన



ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండల పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తీర్థం పరిధిలోని కొత్తఇండ్లు గ్రామంలో డాక్టర్ అరుణ్‌కుమార్ ఆదేశాల మేరకు చిన్నపిల్లలు, గర్భిణులకు వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన కల్పించినట్లు హెచ్‌ఈ కాంతమ్మ, ఎంఎల్‌హెచ్‌పి దివ్యశ్రీ తెలిపారు. ఎంపిపి స్కూల్, ఏడబ్ల్యూసిలో సీజనల్ వ్యాధుల నివారణ, చేతుల పరిశుభ్రత, పౌష్టికాహారం గురించి అవగాహన కల్పించారు. అలాగే డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వ్యాధులు రాకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్ రెడ్డి, ఏ డబ్ల్యుసి తిప్పక్క, ఆషా వర్కర్ పాల్గొన్నారు.

సమస్యలపై కమిషనర్‌కు వినతి



ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు మున్సిపల్ పరిధిలో గల వివిధ సమస్యల గురించి పలమనేరు పరిరక్షణ సమితి నాయకులు శనివారం మున్సిపల్ కమిషనర్ ఎన్వీ రమణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. పలమనేరు గంగమ్మ గుడివీధిలోని రోడ్డుకి ఇరువైపులా రోడ్డుకు ఆక్రమించుకొని ఉన్న ఆంగళ్లను తొలగించాలని, అంబేద్కర్ సర్కిల్ నుండి గుండుబాయి వరకు గల రోడ్డులో ఇరువైపులా రోడ్డుకు ఆక్రమించుకొని ఉన్న అంగళ్లను తొలగించాలని కోరారు. అలాగే రెకమాను సర్కిల్ వద్ద గల పెద్ద స్పీడ్ బ్రేకర్‌ను తగ్గించాలని, గుడియాత్తం కూడలిలో మురుగునీటి కాలువ పూడికతీత పనులు చేపట్టాలని వారు కోరారు.

డ్రోన్ ద్వారా శానిటేషన్ పనుల పరిశీలన



ప్రజాశక్తి- శాంతిపురం: డ్రోన్ ద్వారా శానిటేషన్ పనులను మండల పరిషత్ అభివృద్ధి అధికారి కుమార్ కెనమాకులపల్లి గ్రామ పంచాయతీలో శనివారం పరిశీలించారు. పరిశీలన అనంతరం డ్రోన్ ద్వారా అందిన సమాచారం ప్రకారం ఎక్కడైతే అపరిశుభ్రంగా ఉందో ఆ ప్రదేశాలను ఫోటో షాట్ చేసి సంబంధిత పంచాయతీ కార్యదర్శికి పంపించి వెంటనే చర్యలు తీసుకోవలసినదిగా ఆదేశించారు. పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణ డ్రోన్ ద్వారా చేపడతామని తద్వారా సమయం ఆదా అవుతుందని, వెంటనే పనులు పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎపిఆర్.కుమార్, సర్పంచ్ జయరాం, మాజీ వైస్ ఎంపీపీ ఉదయ్ కుమార్, పంచాయతి కార్యదర్శి పాల్గొన్నారు.

'సభ్యత నమోదు' విజయవంతం చేద్దాం: ఎంపి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్ : తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, చిత్తూరు పార్లమెంట్ అధ్యక్షులు సిఆర్ రాజన్ పిలుపునిచ్చారు. శనివారం చిత్తూరు పార్లమెంటు కార్యాలయంలో ఎంపీ, ఎమ్మెల్యే, సిఆర్ రాజన్, నియోజకవర్గం పరిశీలకులు సునీల్ చౌదరి, మాజీ ఎమ్మెల్యే ఏఎస్.మనోహర్, టిడిపి సీనియర్‌నేత చంద్రప్రకాష్, చిత్తూరు పార్లమెంటు వాణిజ్య విభాగం ఉపాధ్యక్షుడు సునీల్ చౌదరి తదితరులు సమావేశమయ్యారు. ప్రస్తుతం చిత్తూరు పార్లమెంటు పరిధిలో జరుగుతున్న సభ్యత్వ నమోదు కార్యక్రమంపై చర్చించారు. గతం కంటే ఈసారి సభ్యత్వ నమోదును పెంచాలని నిర్ణయించారు. ఆ దిశగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని కోరారు.

అలాగే చిత్తూరు నియోజకవర్గ పరిధిలోని తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మురుకంబట్టు, రూరల్ మండలం బిఎన్‌ఆర్ పేట, గుడిపాల మండల కేంద్రంలో శనివారం ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ ఘనంగా ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్సీ రాజసింహులు, మేయర్ అముద, మాజీ ఎమ్మెల్యేలు గాంధీ, ఏఎస్ మనోహర్, చంద్ర ప్రకాష్ పాల్గొన్నారు.

ఎస్ఆర్ పురం: తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని తెలుగు తమ్ముళ్ల విజయవంతం చేయాలని ఎమ్మెల్యే వి.ఎం థామస్ పిలుపునిచ్చారు. శనివారం ఎస్ఆర్ పురంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సభ్యత్వ నమోదు పై సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు, ఇందిరమ్మ, గుండయ్య, దొడ్డ హేమాద్రి యాదవ్ పాల్గొన్నారు.


చిత్తూరు సమావేశంలో ఎంపి, ఎమ్మెల్యేలు

గంగవరం: తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నియోజకవర్గ వ్యాప్తంగా విజయవంతం చేయాలని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని పత్తికొండ గ్రామంలో శనివారం సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ఐటిడిపి స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ అంబరీష్ మొదటి సభ్యత్వాన్ని నమోదు చేసుకున్నారు. మండల పార్టీ అధ్యక్షులు సోమశేఖర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ప్రతాపరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కార్వేటినగరం: స్థానిక టిడిపి కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే డాక్టర్ వి.ఎం థామస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండలంలోని టిడిపి కుటుంబ సభ్యులందరు సభ్యత్వలు తీసుకోవాలని జిల్లాలోనే జిడి నెల్లూరు నియోజకవర్గం అత్యధిక సంఖ్యలో సభ్యత్వం ఉండాలన్నారు. అధ్యక్షులు చెంగలరాయల్ యాదవ్, కార్యదర్శి రాజేంద్ర రెడ్డి, నాగేశ్వరరాజు, బిగల రమేష్ పాల్గొన్నారు.

- సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఎమ్మెల్యే థామస్

కుప్పం టౌన్ : తెలుగుదేశం పార్టీలోనికి నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ ఆహ్వానం పలికారు. శనివారం పట్టణ పరిధిలోని కమతమూరు ప్రాంతంలో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఏపీఎస్‌ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని రాయల్ మహల్ కళ్యాణ మండపంలో శనివారం తెలుగుదేశం పార్టీ సర్వసభ్య సమావేశం అధ్యక్షులు బి.కిషోర్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. మాజీ సర్పంచ్ జై కుమార్ గౌడు, మంజునాథ్ రెడ్డి, సుబ్రహ్మణ్యం, అమీర్ బాష పాల్గొన్నారు.


తిరుమల 'స్వచ్ఛత'కు భరోసా

340 మందితో పారిశుద్ధ్య నిర్వహణ


తిరుమలలో భక్తుల కోసం పరిశుభ్రమైన గదులు

ప్రజాశక్తి -తిరుమల: తిరుమల శ్రీవారి దర్శనానికి నిత్యం వేలాదిమంది విచ్చేసి మంచి దర్శనం, తలనీలాలు సమర్పణ, విశ్రాంతి కోసం పరిశుభ్రంగా వుండే గది కావాలని ప్రతి భక్తుడూ తలుస్తాడు. రాజకీయ ప్రముఖుల సిఫారసులతో విచ్చేసే వారికి టిటిడి ప్రత్యేకంగా కొన్ని గదులను రిజర్వ్ చేసి ఉంచుతుంది. ఇందులో భాగంగా వచ్చే భక్తులు కౌస్తుభం, పాంచజన్యం, నందకం గదులను ప్రత్యేకంగా కేటాయిస్తారు. ఈ గదుల పారిశుద్ధ్యం నిర్వహణకూ పెద్దపీట వేస్తారు. ఈ నిర్వహణకు బెంగుళూరుకు చెందిన ప్రముఖ కంపెనీ 'స్వచ్ఛత' కార్పొరేషన్‌కు కేటాయించారు. స్వచ్ఛత కార్పొరేషన్ టిటిడి సేవే భాగ్యంగా విధులు నిర్వహిస్తోంది. దాదాపు 340 మంది కార్మికులకు ప్రతి నెలా సకాలంలో వేతనాలు అందిస్తూ సేవలు నిర్వహిస్తుండగా... భక్తుల నుండి పారిశుధ్య నిర్వహణకు సంబంధించి ప్రశంసలు అందుకుంటుంది. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో గదులు పారిశుధ్యం నిర్వహణ పెద్ద కష్టమే...అయితే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా గదులు శుభ్రపరిచి మన్ననలు పొందారు. రెండు షిఫ్ట్ లుగా కార్మికులు సేవలందించారు...టిటిడి కూడా కార్మికులకు ప్రశంసించింది.

గదులు శుభ్రంగా ఉన్నాయ్ :
శ్రీనివాస్, రామచంద్ర, బెంగళూరు, చెన్నయ్



టి టి డి నిర్వహణ చాలా బాగుంది. గదులు శుభ్రంగా ఉన్నాయి. ఇలాగే కొనసాగాలని ఆశిస్తున్నాం. మేము కుటుంబ సమేతంగా ప్రతి ఏడాదీ వస్తాం. ఎపుడు తిరుమలకు వచ్చిన గదులు అంతే శుభ్రంగా ఉంటాయి. పారిశుధ్య కార్మికులను ఈ విషయంలో మెచ్చుకోవాల్సిందే.

రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబు లక్ష్యం: ఎమ్మెల్సీ

ప్రజాశక్తి- గుడిపల్లి: మండలంలోని సంగంపల్లి గ్రామ పంచాయతీ చిన్నపర్తికుంట గ్రామంలో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి శనివారం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ భూమిపూజ చేశారు. ఈ గ్రామంలో 40 సంవత్సరాలగా రోడ్డు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో మండల నేతలు అక్కడున్న రైతులను ఒప్పించి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మండలంలోని యువతకు ఉద్యోగ కల్పన చేయడానికి ఎన్నో పరిశ్రమలు రాబోతున్నాయని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తెలిపారు. మండల పార్టీ అధ్యక్షుడు బాబు నాయుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్, మాజీ జెడ్పిటిసి బేటప్ప నాయుడు, నాయకులు మునిరాజు, హేమంబార్ గౌడు, సుబ్రమణి, గోవిందస్వామి, బాబు, మంజు, వెంకటేష్, జనసేన అమీర్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

కూలీలకు గిట్టుబాటు వేతనం కల్పించాలి

జిల్లా నీటి యాజమాన్య సంస్థ సంచాలకులు రవికుమార్



ప్రజాశక్తి- పూతలపట్టు : ఉపాధి కూలీలకు గిట్టుబాటు వేతనం కల్పించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ సంచాలకులు రవికుమార్ సూచించారు. శనివారం మండలంలోని ఎర్ర చెరువుపల్లి పాటూరు, పూతలపట్టు గ్రామపంచాయతీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సిమెంటురోడ్ల నిర్మాణం ఏడు పనులను ఆయన పరిశీలించారు. అంచనా వ్యయం రూ.33 లక్షల విలువగల పనులను పూర్తి చేయాలని తెలిపారు. అనంతరం పాటూరు గ్రామపంచాయతీలో మామిడి తోటల పెంపకంలో రింగ్ ట్రెంచ్ పనులు పరిశీలించి కూలీలకు సకాలంలో వేతనాలు వస్తున్నాయా లేదా రోజువారి వేతనం ఎంత వస్తున్నదన్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. వేతనదారులకు ఒక్కొక్కరికి రూ.291లు గిట్టుబాటు అయ్యే విధంగా పనిచేయడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. మండలానికి కేటాయించిన పశువుల షెడ్లు నిర్మాణం చేపట్టాలని, గ్రామపంచాయతీ వారీగా అందరికీ పనులు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారి బి.సుబ్రహ్మణ్యం, పంచాయతీరాజ్ విభాగం వర్క్ ఇన్స్పెక్టర్ సుబ్రహ్మణ్యం, టీఏలు పూర్ణ, శ్రీహరి, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రీ సర్వేలు



ప్రజాశక్తి - కార్వేటినగరం: భూ సమస్యలను పరిష్కరించేందుకే రీ సర్వేలు నిర్వహించడం జరిగిందని మండల తహశీల్దార్ భగవతి అన్నారు. శనివారం మండల పరిధిలోని కేశవకుప్పం సచివాలయ ఆవరణంలో నిర్వహించిన సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం గతంలో చేపట్టిన రీసర్వేలో లోపాలను గుర్తించడానికి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రీసర్వేలో లోటు పాటులు ఉంటే మళ్లీ అధికారులు దృష్టికి తీసుకొచ్చి సవరణ చేసుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో రీసర్వే డీటీ స్వరూపరాణి, మండల సర్వేయర్ బాబు, వీఆర్వో గోపి, విలేజ్ సర్వేయర్ చరణ్ తేజ, సర్పంచ్ జ్యోతి, నాయకులు రవిరాజు, దొరస్వామి రాజు, లక్ష్మణరాజు పాల్గొన్నారు.

పలమనేరు: మండలంలోని కొలమాసనపల్లి పంచాయతీ శ్రీరంగరాజ పురంలో రీసర్వే గ్రామసభను నిర్వహించినట్లు మండల భూసర్వే అధికారి వెంకట రమణరెడ్డి, డిప్యూటి తహశ్శీల్దార్ శివజ్యోతి తెలిపారు. ఈసందర్భంగా రైతులు, ప్రజల నుంచి భూసమస్యలపై అర్జీలు తీసుకున్నారు. భూ సర్వేలో ఏదైనా అవకతవకలు ఉంటే రీ సర్వే చేసి పరిష్కరిస్తామని రైతులకు హామీ ఇచ్చారు.

క్రైం న్యూస్

ఎంపీటీసీ కిడ్నాప్, మృతి కేసులో

10 మంది అరెస్ట్

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు
పాలసముద్రం మండలం నరసింహపురం టిడిపి ఎంపీటీసీ జగన్నాథరాజు కిడ్నాప్ గురై ఆ తర్వాత మృతి చెందిన కేసులో గంగాధర నెల్లూరు పోలీసులు 10 మంది నిందితులను అరెస్టు చేశారు. గంగాధర నెల్లూరు సిఐ లక్ష్మీనారాయణ శనివారం విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించారు. పాలసముద్రం మండలం నరసింహపురం పంచాయతీ టీబీఎన్‌ఆర్ పురం గ్రామానికి చెందిన టిడిపి ఎంపీటీసీ జగన్నాథరాజుతోపాటు అతని స్నేహితులు చిన్నమ రాజు, ఏకాంబరం కలిసి కారులో డ్రైవర్ శంకర్‌తో ఈనెల 21వ తేదీ సాయంత్రం గంగాధర నెల్లూరు మండలం అంబోదరపల్లి సమీపంలో ప్రయాణం సాగిస్తుండగా, వారి వెనకాలే మూడు కార్లులో కొందరు వ్యక్తులు వెంబడించి అడ్డగించారు. ఆ వ్యక్తులు ముందుగా జగన్నాథరాజును వారి కారులో నుంచి బలవంతంగా దింపి కిడ్నాపర్ల కారులోకి ఎక్కించారు. అదేవిధంగా ఏకాంబరం, చిన్నమరాజు, శంకర్లను వేరువేరు రెండు వాహనాల్లో ఎక్కించుకుని సమిసిరెడ్డిపల్లి వరకు ప్రయాణించారు. గ్రామం వద్దకు రాగానే కిడ్నాపర్లు వారి కారులో నుంచి ఏకాంబరం, చిన్నమరాజు, శంకర్‌లను దించేసి అక్కడి నుండి జగన్నాథరాజును మళ్లీ గంగాధర నెల్లూరు మీదుగా నూజివీడుకు తరలించారు. ఈనెల 22వ తేదీ తెల్లవారు జామున జగన్నాథరాజును వాహనాల నెలసరి కంతులు కట్టాలని లేదంటే వాహనాలను తమకు స్వాధీనం చేయాలని కిడ్నాపర్లు ఒత్తిడి చేశారు. దీంతో జగన్నాథరాజు తీవ్ర ఒత్తిడికి లోనై కాలకృత్యాలకు వెళ్లి వస్తానని చెప్పి కారు దిగి పక్కనున్న పొలాల్లోకి పారిపోయాడు. కొంత దూరం పోయిన తర్వాత స్పృహ తప్పి పడిపోయి ఉండటాన్ని గమనించిన కిడ్నాపర్లు నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించగా చనిపోయాడని తెలపడంతో కిడ్నాపర్లు డ్రైవర్ శంకర్‌కు సమాచారం ఇవ్వడం జరిగింది. జగన్నాథరాజు భార్య రాధిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి వారిపై నిఘా ఉంచామన్నారు. ఈ కేసులో ప్రధానంగా జెసిబి యంత్రాలు విక్రయాలు సాగించే ఏజెంట్లు అయినా ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురంకు చెందిన లక్కోజి సతీష్, అనపర్తి అనిల్ కుమార్‌ల ద్వారా జగన్నాథ రాజు ఫైనాన్స్ జెసిబి పోర్టు కారు తీసుకుని కంతులు వాయిదాలు కట్టకుండా పెండింగ్ పెట్టేసాడని కారణంతో ఏజెంట్లు ఈ కిడ్నాప్‌కు పాల్పడినట్లు చెప్పారు. జగన్నాథరాజును కిడ్నాప్ చేయడంతో పాటు ఆ తర్వాత అతను మృతికి కారణమైన కేసులో నిందితులైన కర్నూలు జిల్లా కనకవేడుపేటకు చెందిన బోయ వీరేష్ (22), మునగాల గ్రామానికి చెందిన దాసరయ్య గారి పెద్దయ్య (48), ఏలూరు జిల్లా ముసనూరు మండలం కాత్రాయపాడుకు చెందిన గుత్తి నాగరాజు (34), భీమడోలు గ్రామానికి చెందిన దాసరి చంద్రయ్య(43), చోడవరం గ్రామానికి చెందిన గొర్రెల సత్యబాబు (24), శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం చిన్నయ్యపేట గ్రామానికి చెందిన మణికంఠ (26), విజయనగరం జిల్లా పూసపాటివేగ మండలం చౌడమ్మ అగ్రహారం గ్రామానికి చెందిన గుడివాడ ఆదర్శ్ (20), గుడివాడ మణికంఠలను (22), ఈస్ట్ గోదావరి జిల్లా రాజానగరం మండలం పాలచర్ల గ్రామానికి చెందిన భావిశెట్టి శివసత్య నారాయణ (27), నల్లజేర్ల మండలానికి చెందిన అనిల్ కుమార్(32)లను 26న చిత్తూరు కట్టమంచి చెరువు వద్ద అరెస్టు చేసి వారు ప్రయాణించిన కార్లను స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. ఈ కేసులో పురోగతి సాధించిన సీఐ లక్ష్మీనారాయణతో పాటు సిబ్బందిని జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు అభినందించారు.

13 మందికి రూ.1,30వేలు జరిమానా

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ నిత్య బాబు శుక్రవారం వాహన తనిఖీ చేస్తున్న సమయంలో మద్యం తాగి వాహనాలు నడుపుతూ 13 మంది పట్టుబడ్డారు. వీరిని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టులో శనివారం ప్రవేశపెట్టగా జడ్జి ఉమాదేవి వాహనదారులు13 మందికి ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున మొత్తం 1,30,000లు జరిమానా విధించడం జరిగింది. ఈ 10 నెల వ్యవధిలో చిత్తూరు ట్రాఫిక్ పోలీసులు మద్యం తాగి వాహనాలు నడిపిన 437 మందికి సుమారు రూ.43.8 లక్షల ఫైన్ విధించడం జరిగింది.

విశ్రాంత కానిస్టేబుల్ మృతి

ప్రజాశక్తి- పూతలపట్టు
పాకాల - పూతలపట్టు రైలు మార్గం మధ్యలో అదుపుతప్పి రైలు కింద సిఆర్పిఎఫ్ విశ్రాంత కానిస్టేబుల్ మృతిచెందాడు. రైల్వే పోలీసుల వివరాలు మేరకు తమిళనాడు రాష్ట్రంలోని కోయంబత్తూరుకు చెందిన వడివేలు (75) సొంత గ్రామానికి వస్తుండగా ఈ ప్రమాదంలో మరణించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

చోరీ కేసులో వ్యక్తి అరెస్టు



ప్రజాశక్తి - సదుం: తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని శనివారం అరెస్టు చేసినట్లు సదుం ఎస్సై షేక్ షావలి తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ తమకు అందిన సమాచారం మేరకు సదుం బస్టాండ్ వద్ద అనుమానంగా తిరుగుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించగా అన్నమయ్య జిల్లా, మదనపల్లి టౌన్, మంజునాథ్ కాలనీకి చెందిన కావడి సోమశేఖర్ (29)గా గుర్తించారు. సదరు వ్యక్తి వరుస దొంగతనాలకు పాల్పడుతున్నట్లు విచారణలో తేలిందన్నారు. ఈ వ్యక్తిపై ఇప్పటికే 15 కేసులు ఉన్నట్టు ఎస్సై తెలిపారు. ఈనెల 5వ తేదీన సదుం పంచాయతీ వర్కర్ చిరంజీవి ఇంట్లో 22 గ్రాములు బంగారు నగలు, పెనుమూరు, కలికిరి టౌన్ లోను సోమశేఖర్ దొంగతనాలకు పాల్పడినట్లు విచారణలో తేలిందన్నారు. అనంతరం నిందితుడి వద్దనుండి మొత్తం 79 గ్రాముల బంగారు వస్తువులను రికవరీ చేయడం జరిగిందన్నారు. కేసు నమోదు చేసి పీలేరు కోర్టులో హాజరు పరచగా, జడ్జి అతన్ని రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: ద్విచక్రవాహన్ని లారీ ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు మరణించాడు. పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు.. శనివారం మండలంలోని మొగిలి ఘాట్‌లో రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. గంగవరం గ్రామానికి చెందిన మోహన్ కుమారుడు హేమచంద్ (22) ద్విచక్ర వాహనంలో గంగవరం నుండి చిత్తూరుకి వెళ్తుండగా ముందు వెళ్తున్న లారీని స్పీడ్ బ్రేకర్ వద్ద సోలో అవ్వడంతో అతివేగంగా వస్తున్న హేమచంద్ లారీ వెనక భాగంలో ఢీకొన్నాడు. ఈ సంఘటనలో అతనికి తలకు తీవ్రమై గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

క్రీడా దుస్తులు పంపిణీ


క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేస్తున్న దాతలు

ప్రజాశక్తి- చౌడేపల్లి: స్థానిక ఉన్నత పాఠశాలలో చిత్తూరు జిల్లా స్థాయిలో అండర్- 17 బాల బాలికల కబడ్డీ క్యాంప్ నిర్వహిస్తున్నారు. వీరికి ప్రముఖ పారిశ్రామికవేత్త కేసీ.నవీన్ బాబు ఆయన సతీమణి మోనిక క్రీడాదుస్తులను పంపిణీ చేశారు. ఈ క్రీడాకారులు శనివారం క్యాంపు ముగించుకుని రాష్ట్రస్థాయిలో జరిగే కబడ్డీ పోటీలకు సన్నద్ధం అవుతున్నారు. ఈ సందర్భంగా నవీన్ బాబు ఆయన సతీమణి 40 మంది విద్యార్థులకు అవసరమైన క్రీడా దుస్తులను అందజేశారు. వీరు గతంలోనూ చిత్తూరు జిల్లా జట్టుకు దాతగా వ్యవహరించారు. ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగరాజురెడ్డి దాతలను సత్కరించారు. ఉపాధ్యాయులు వెంకటేష్, రాజేంద్ర, మురళీ, ఈశ్వర్, సుధాకర్, పరిమళ, క్రీడాకారులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు రోజా పరామర్శ

ప్రజాశక్తి- విజయపురం (నింద్ర): నింద్ర మండలం ఏపీ సాహిత్య అకాడమీ మాజీ డైరెక్టర్ పిఎస్.జయశ్రీ శ్యామ్‌లాల్ తల్లి ఎలిజబెత్ మరణించారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఆర్కే రోజా శనివారం భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే విజయపురం మండలం కోసలనగరం పంచాయతీ కేశవపురం ఏఎడబ్ల్యూలో వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు జయరామయ్య ఆకస్మిక మృతి చెందడంతో భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

హరిత రాయబారులకు సన్మానం



ప్రజాశక్తి- శాంతిపురం: మండలంలో గత రెండు నెలలుగా జరుగుతున్న డీప్ శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమం శనివారం ముగిసింది. ఈకార్యక్రమం 23 గ్రామ పంచాయతీలలో జరిగింది. ముళ్ళ పొదలు తొలగించడం, సైడ్ డ్రైన్ శుభ్రం, చెత్త దిబ్బలు, పేడ దిబ్బలు తొలగింపు, ట్యాంకులు శుభ్రత, క్లోరినేషన్, ఎస్‌డబ్ల్యూపిసి షెడ్ల నిర్వహణం వంటి కార్యక్రమాలు ఎక్కువ సంఖ్యలో కూలీలను, జెసిబి, ట్రాక్టర్ యంత్రాలను వినియోగించి పనులు చేశారు. అనంతరం మండల టిడిపి అధ్యక్షులు విశ్వనాథ్ నాయుడు 23 గ్రామ పంచాయతీలలోని హరిత రాయబారులను దీపావళి పండుగ కానుకగా నూతన వస్త్రాలతో సన్మానించి అభినందించడం జరిగింది. కెనమాకులపల్లి సర్పంచ్ జయరాం, మాజీ వైస్‌ఎంపీపీ ఉదయ్ కుమార్, మాజీ రెస్కో వైస్ ఛైర్మన్ చలపతి, రాళ్ళబూదుగూరు సర్పంచ్ లక్ష్మి మురుగేష్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎపిఆర్.కుమార్, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఎమ్మార్పీఎస్ నాయకులు దేవరాజ్ పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్డుకు భూమిపూజ



ప్రజాశక్తి- గుడిపల్లి: మండలం కోటపల్లి గ్రామంలో సిమెంట్ రోడ్డు పనులకు శనివారం మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్, మండల పార్టీ అధ్యక్షుడు బాబు నాయుడు భూమిపూజ నిర్వహించారు. సుమారు 10 లక్షల రూపాయలతో సిమెంట్ రోడ్డు నిర్మిస్తున్నట్లు వారు తెలిపారు. రోడ్డు పనులకు నిధులు మంజూరు చేసి గ్రామస్తుల ఇబ్బందులు తొలగించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. టిడిపి నాయకులు మాజీ ఎంపీపీ మునిరాజు, మాజీ జెడ్పిటిసి బేటప్ప నాయుడు, హేమంబర్ గౌడు, విజయ్ కుమార్, రామయ్య, సుబ్రమణి అధికారులు పాల్గొన్నారు.

సిమెంటు రోడ్ల చిచ్చు

ఎగువ కండ్రిగలో తెలుగు తమ్ముళ్ల తన్ను లాట

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: మండలంలోని శనివారం ఎగువ కమ్మకండ్రిగ పంచాయతీ సీఎం కండ్రిగ గ్రామంలో సిమెంట్ రోడ్డు నిర్మాణం కోసం తెలుగు తమ్ముళ్ల మధ్య ఘర్షణ జరిగింది. సీఎం కండ్రిగ గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు దేవరాజు నాయుడు, ఎగువ కమ్మకండ్రిగ గ్రామానికి చెందిన వెంకటేష్ నాయుడు మధ్య సిసి రోడ్డు వివాదం తలెత్తింది. మా ఊరికి రోడ్డు వేయడానికి నువ్వు ఎవరంటూ వెంకటేష్‌పై ప్రత్యర్థులు దాడికి దిగారు. మా ఊరికి రోడ్డు నేనే వేస్తానంటూ వెంకటేష్‌పై దాడి చేసినట్లు ఆయన ఆరోపించారు. తనకు పంచాయతీ రిజర్వేషన్ ఉన్నా దేవరాజు నాయుడు కుటుంబ సభ్యులు పనులను అడ్డుకుంటూ దాడి చేశారని వెంకటేష్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

తిరుపతికి తలమానికం తుడా టవర్స్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: తిరుపతికి తలమాణికం తుడా టవర్స్ అని, వేలం నిర్వహించి 2026, మార్చి 31 కల్లా తుడా టవర్స్ నిర్మాణాలు పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామని తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ ఉపాధ్యక్షులు ఎన్.మౌర్య అన్నారు. నగరంలోని రాయలచెరువు రోడ్డులో తుడా ఆధ్వర్యంలో నిర్మిస్తున్న తుడా టవర్స్ నిర్మాణ పనులను ఉపాధ్యక్షులు ఎన్.మౌర్య శనివారం ఇంజినీరింగ్ అధికారులతో కలసి పరిశీలించారు. అనంతరం తుడా కార్యాలయంలో అధికారులతో సమావేశమై సమీక్షించారు.ఈ సందర్భంగా ఎన్.మౌర్య సమావేశంలో మాట్లాడుతూ తుడా టవర్స్ ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా 3.6 ఎకరాల స్థలంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నామని అన్నారు. ఇందులో గ్రౌండ్ ఫ్లోర్ తో పాటు 13 అంతస్థులతో తుడా టవర్స్ నిర్మిస్తున్నామని అన్నారు. 2025, మార్చి లోపు అన్ని పనులు పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామని అన్నారు. విస్తతంగా ప్రచారం చేసేందుకు నూతనంగా బ్రోచర్ తయారు చేయించామని, ఇందులో అన్ని వివరాలు పొందుపరిచామని అన్నారు. కార్యదర్శి వెంకటనారాయణ, సూపరింటెండెంట్ ఇంజినీర్ కష్ణారెడ్డి, సలహాదారులు రామకష్ణ రావు, ఈఈ రవీంద్రయ్య, కె.పి.సి సంస్థ ఈ.డి.సుశీల్ కుమార్ ఉన్నారు.